రిజిస్ట్రేషన్‌లేని వాహనాలు స్వాధీనం

చింతామణి, జూన్ 22: చింతామణి పట్టణ పోలీసులు రెండురోజులపాటు నిర్వహించిన ప్రత్యేక కార్యాచరణలో రిజిస్ట్రేషన్‌లేని కార్లు, ద్విచక్రవాహనాలు ఇతర వాహనాలను భారీగా స్వాధీనం చేసుకుని జరిమానా విధించారు. రిజిస్ట్రేషన్ సంఖ్య లేకున్నా రాజకీయ నాయకులు, ఇతర ఫొటోలు వేసినట్లు గుర్తించామని, రవాణాశాఖ నియమాలు ఉల్లంఘించడంతోనే స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ విజికుమార్, ఎస్ఐ రమేశ్, నారాయణస్వామి నేతృత్వంలో శుక్ర, శనివారాల్లో నిర్వహించిన కార్యాచరణలో వందలసంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు.

డీకే వ్యూహం బెడిసికొట్టిందా..?

- చెన్నపట్టణలో పోటీపై పార్టీలోనే అసంతృప్తి
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మంత్రి సతీశ్‌జార్కిహొళి
- వంతపాడిన మరికొందరు మంత్రులు


డీకే శివకుమార్


సతీశ్‌జార్కిహొళి


బెంగళూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పన్నిన వ్యూహానికి సొంతపార్టీనుంచే చుక్కెదురవుతోంది. ఓడిన చోటే గెలవాలని పట్టుదలతో డీకే శివకుమార్ కొత్త ఎత్తుగడకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం శాసనసభ్యుడిగా ఎన్నికై జలవనరులు, బెంగళూరు అభివృద్ధితోపాటు ఉపముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం చెన్నపట్టణ నియోజకవర్గంలో ఒకే రోజు 14 ఆలయాలు సందర్శించి ఇక్కడి ప్రజలకు దగ్గర కావాలని, ఈ ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షిస్తున్నా అని, మీ ఆశీస్సులు ఉంటే ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అవుతానని ప్రకటించారు. ఆయన వ్యూహానికి రెండు కీలకమైన అంశాలు ముడిపడి ఉన్నాయి. రెండుసార్లు బెంగళూరు గ్రామీణ లోక్‌సభ నుంచి గెలుపొందిన తమ్ముడు డీకే సురేశ్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. సురేశ్‌పై జేడీఎస్ అగ్రనేత దేవెగౌడ అల్లుడు డాక్టర్ సీఎన్ మంజునాథ్‌ను బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయించి విజయం సాధించింది. ఒక్కలిగ సామాజికవర్గంలో దేవెగౌడ కుటుంబమే కాదు తాను కూడా ఉన్నానని పలు సందర్భాల్లో డీకే శివకుమార్ చెప్పుకున్నారు. చెన్నపట్టణ ఎమ్మెల్యేగా కొనసాగిన కుమారస్వామి ప్రస్తుతం కేంద్రమంత్రి అయ్యారు. ఆ స్థానం నుంచి కుమార వారసుడు నిఖిల్‌ను బరిలోకి దింపాలని జేడీఎస్-బీజేపీ భావిస్తున్నాయి. నిఖిల్ ఐదేళ్ల క్రితం మండ్య లోక్‌సభ ఎన్నికల్లోనూ, ఏడాది క్రితం రామనగర శాసనసభ ఎన్నికల్లోనూ ఓడిపోయారు. ప్రస్తుతం అన్నీ అనుకూలంగా ఉండడంతో నిఖిల్‌ను పోటీ చేయించాలని దేవెగౌడ కుటుంబం సిద్ధమైంది. డీకే శివకుమార్ వెనుకడుగు వేస్తే నిఖిల్ సునాయాసంగా గెలుస్తారు. ప్రత్యర్థి కుటుంబం రాజకీయ ఎదుగుదలకు చెక్ పెట్టాలంటే నేరుగా రంగంలోకి దిగాలని డీకే శివకుమార్ భావించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత దాదాపు పదిరోజులు ఆయన తీవ్రనిరాశతో గడిపారు. చెన్నపట్టణ నుంచి నేరుగా పోటీ చేయడం ద్వారా దేవెగౌడ కుటుంబాన్ని ఢీకొనడం, మరోవైపు సునాయాసమైన కనకపుర నుంచి తమ్ముడు డీకే సురేశ్‌ను ఎమ్మెల్యే చేయాలని భావిస్తున్నారు. ఈ విషయమై సీఎంగానీ, అధిష్ఠానంగానీ స్పందించలేదు. కానీ బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే సురేశ్‌కుమార్ ఈ అభిప్రాయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఎమ్మెల్యేగా ఉంటూ మరో చోట పోటీ చేయడం ఎక్కడి ప్రజాస్వామ్యం అని ప్రశ్నించారు. రెండు మూడురోజులుగా మౌనంగా ఉన్న పార్టీ నాయకులు ఒక్కొక్కరు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. బెళగావి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సతీశ్‌జార్కిహొళి స్పందించారు. డీకే శివకుమార్ మరోచోట పోటీచేయడం సరికాదన్నారు. హోంశాఖ మంత్రి పరమేశ్వర్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోటీ విషయాన్ని అధిష్ఠానం నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. మంత్రి దినేశ్‌గుండూరావు కూడా ఇదే అభిప్రాయం తెలిపారు. మరోవైపు డీకే శివకుమార్ పోటీ చేస్తే ఓడించాలనే ఎత్తుగడ కూడా సొంతపార్టీలోనే కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత జార్కిహొళి కుటుంబంపై డీకే శివకువర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా అతడిని పిచ్చాసుపత్రికి పంపాలనడం జార్కిహొళి కుటుంబీకులలో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. బెళగావి రాజకీయాల్లో డీకే శివకుమార్ జోక్యంతోనే 2019లో కాంగ్రెస్ - జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వం పతనమైందనే విమర్శలు ఉన్నాయి. డీకే శివకుమార్ సవాల్ చేస్తూ చెన్నపట్టణలో గెలుపొంది ఏకంగా ముఖ్యమంత్రి కావాలని భావిస్తున్నారు. ఆయనను బహిరంగంగానే వ్యతిరేకిస్తున్న జార్కిహొళి కుటుంబం అంత సునాయాసంగా వదిలిపెట్టదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జార్కిహొళి కుటుంబంలో సతీశ్‌జార్కిహొళి రాష్ట్రమంత్రి కాగా, ఆయన కుమార్తె ప్రియాంక చిక్కోడి ఎంపీగా ఉన్నారు. అన్న రమేశ్‌జార్కిహొళి, తమ్ముడు బాలచంద్ర జార్కిహొళి బీజేపీ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. చిన్నతమ్ముడు లఖన్ జార్కిహొళి ఇండిపెండెంట్ ఎమ్మెల్సీగా వ్యవహరిస్తున్నారు. ఇలా వీరి కుటుంబంలో ఐదుగురు ప్రజాప్రతినిధులు ఉన్నారు. సతీశ్‌జార్కిహొళి ఎస్టీ సామాజికవర్గానికి చెందినవారు కావడం, ఉత్తరకర్ణాటకలో వారి ప్రాబల్యం అధికంగా ఉండడంతో ఆయనకు మద్దతు ఇచ్చేవారు కనీసం 25-35 ఎమ్మెల్యేలు ఉన్నారు. రాష్ట్రంలో మరోసారి జార్కిహొళి కుటుంబం ద్వారా రాజకీయ సంక్షోభం వస్తుందని, అది సతీశ్ జార్కిహొళి నిర్ణయానికి అనుకూలంగా ఉంటుందని బీజేపీ సీనియర్‌నేత, ఎంపీ గోవింద కారజోళ అభిప్రాయపడ్డారు. ఇదే విషయాన్ని మరింత మంది ప్రస్తావించారు. ఎన్నికలకు ముందే స్వయానా సీఎం సిద్దరామయ్య ఆపరేషన్ కమలకు కుట్ర సాగుతోందని సంచలన ఆరోపణ చేశారు. మరోవైపు డీకే శివకుమార్ చెన్నపట్టణ నుంచి బరిలోకి దిగితే అక్కడ సుదీర్ఘకాలంగా పాతుకుపోయిన మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్ సులభంగా వదిలేది ఉండదు. డీకే శివకుమార్ వ్యతిరేక కూటమి అంతా కలిపి ఆయనను ఢీ కొట్టేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. చెన్నపట్టణలో ఓడిస్తామని యోగేశ్వర ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు స్పందించిన డీకే శివకుమార్ తనను రాజకీయంగా అంతం చేయడం సవాల్ చేసేవారితో సాధ్యం కాదని ప్రజలు నిర్ణయించాలన్నారు. యోగేశ్వర్ సవాల్‌కు స్పందించేంతటి సమయం తనకు లేదని దాటవేశారు.

టమోటాకు బంపర్ ధర

- రైతుల్లో హర్షం
- 15 కిలోల బాక్సు రూ.900


మార్కెట్‌కు వచ్చిన టమోటా

శిడ్లఘట్ట, జూన్ 22: టమోటాకు మంచి ధర పలకడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. మూడు నాలుగు రోజులుగా 15 కిలోల బాక్స్ టమోటా నాణ్యతకు అనుగుణంగా రూ.400 నుంచి 900 పలుకుతోంది. బయట మార్కెట్లో కిలో టమోటా రూ.80 పలుకుతోంది. సుదీర్ఘకాలం తర్వాత టమోటాకు మంచి ధర పలికిందని రైతులు అంటున్నారు. సాధారణంగా జూన్‌లో టమోటా దిగుబడి తక్కువగా ఉండడంతో ఉన్న పంటకు కొంతధర ఎక్కువగానే ఉంటుందని రైతులు చెబుతున్నారు. మరోవైపు టమోటాపంట రోగాలతో దెబ్బతినగా బాగా ఉన్న కాయలకు మంచి ధర లభిస్తోందన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ ఉండడం, వైరస్‌తో పంట నష్టం కారణంగా ఉన్న టమోటాకు మంచి ధర ఉందని వ్యాపారస్తులు వెంకటేశ్, నారాయణస్వామి తెలిపారు. పదిరోజులుగా బాక్స్‌పై 150 రూపాయలకు పెరిగిందన్నారు. పట్టణంలోని మార్కెట్ నుంచి ఇతర పట్టణాలు, చింతామణి, చిక్కబళ్లాపుర, గౌరిబిదనూరు, హిందూపురం, తదితర ప్రాంతాలకు సరఫరా అవుతోందన్నారు. గతంలో టమోటాకు కనీసధర లభించక రోడ్డుపక్కన పాడేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం గరిష్ఠధర లభించడం సంతోషంగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




సీఎం సిద్దరామయ్యతో ఎంపీ యదువీర్

సీఎంతో మైసూరు ఎంపీ భేటీ

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మైసూరు బీజేపీ ఎంపీ యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్ శనివారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మైసూరు ప్రాంత అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై సీఎంతో ఎంపీ చర్చించారు. అనంతరం మాజీ ప్రధాని, జేడీఎస్ అగ్రనేత దేవెగౌడను ఆయన నివాసంలో కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. దేవెగౌడ ఆరోగ్యం యదువీర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం యదువీర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని దేవెగౌడ నుంచి సామాజిక, ఆర్థిక అభివృద్ధి గురించి సలహాలు పొందినట్టు తెలిపారు.


మాజీ ప్రధాని దేవెగౌడతో..

అలరించిన వైమానిక విన్యాసాలు

- యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ముగిసిన డైమండ్ జూబ్లీ సంబరాలు


హెలికాప్టర్‌తో విన్యాసం


పారా జంపింగ్

బెంగళూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాదిపాటు డైమండ్ జూబ్లీ వేడుకలు సాగాయి. శనివారం గ్రాండ్‌ఫినాలెతో వేడుకలను ముగించారు. ఆకాశ్‌గంగా స్కై ద్వారా పారా జంపింగ్, హెలికాప్టర్ల ఆకర్షణీయ ప్రదర్శన, వైమానిక ప్రదర్శనలు, డైవింగ్ జట్టు, ఫైట్ కంబాట్ హెలికాప్టర్ ప్రచండ్ మనోహరమైన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఏడాది పొడవునా స్టేషన్ ఫుల్‌మోషన్ స్టిమ్యులేటర్ పేరిట కార్యక్రమాలు నిర్వహించారు. సైక్లింగ్, ట్రెక్కింగ్, ఎయిర్ అడ్వెంచర్ క్యాంప్‌లు ఎయిర్‌ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కుటుంబీకులతో కలసి పలు వేడుకలు కొనసాగించారు. రెండేళ్లకోసారి జరిగే ఏరోఇండియా నిర్వహించే కేంద్రంగా యలహంక ఎయిర్‌బేస్‌కు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది. అల్మామాటర్ ఎయిర్‌లిఫ్ట్‌గా గుర్తింపు ఉంది. ఎయిర్‌మార్షల్ ఎస్‌కే ఇందోరియా, సీనియర్ ఎయిర్‌స్టాఫ్ ఆఫీసర్, ట్రైనింగ్ కమాండ్, ఐఏఎఫ్ ముఖ్యులు డైమండ్ జూబ్లీ వేడుకల గురించి వివరించారు.


వివిధ విభాగాల ఎయిర్‌ఫోర్స్ అధికారులు


విమానాల విన్యాసాలు ఇలా..




ఏపీ సీఎం చంద్రబాబు నుంచి పచ్చచొక్కా అందుకుంటున్న బీటీఎఫ్ కన్వీనర్ వీర

వీర దీక్ష విరమణ

- 945 రోజులు నల్లచొక్కాలోనే బీటీఎఫ్ కన్వీనర్
- చంద్రబాబు చేతులమీదుగా పసుపు చొక్కా స్వీకరణ

బెంగళూరు, జూన్ 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు శాసనసభ నుంచి అవమానంతో బయటకు వచ్చినప్పుడు చేసిన శపథం మేరకు బెంగళూరు తెలుగుదేశం ఫోరం కన్వీనర్ వీర చేపట్టిన దీక్ష ముగించారు. చంద్రబాబునాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా శాసనసభలోకి అడుగుపెట్టేంత వరకు నల్లచొక్కా మాత్రమే ధరిస్తానని ప్రతినబూనారు. అందుకు అనుగుణంగా అప్పటి నుంచి కనకమేడల వీర కేవలం నల్లదుస్తుల్లోనే 945 రోజులు గడిపారు. 2021 నవంబరు 19న అసెంబ్లీ నుంచి చంద్రబాబు శపథం బూని బయటకు వచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తిరుగులేని మెజారిటీ సాధించడం, జనసేన నేత పవన్‌కల్యాణ్, బీజేపీ మైత్రితో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. శాసనసభకు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు రాగా ఆయన చేతులమీదుగానే పసుపుచొక్కా స్వీకరించారు. నల్లటి దుస్తులను ఇక వీడుతున్నట్టు వీర ప్రకటించారు. ఈ మేరకు శనివారం బెంగళూరులో బీటీఎఫ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


బెంగళూరు ఉత్పత్తుల సంతను ప్రారంభిస్తున్న మంత్రి చెలువరాయస్వామి


జీకేవీకేలో ప్రత్యేక ఆకర్షణగా 'సంత'

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): గాంధీ కృషి విజ్ఞాన కేంద్రం (జీకేవీకే) ప్రాంగణంలో బెంగళూరు ఉత్పత్తుల సంత ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శనివారం ఏర్పాటు చేసిన సంతను వ్యవసాయశాఖ మంత్రి చెలువరాయస్వామి ప్రారంభించారు. వైస్‌చాన్స్‌లర్ ఎస్‌వీ సురేశ్ పాల్గొన్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటల ఉత్పత్తులు, విత్తనగింజలు, సిరిధాన్యాలు, వ్యవసాయ యంత్రాలతోపాటు సేంద్రీయ రాగులు, బెల్లం తదితర ఉత్పత్తులు ప్రదర్శించారు. సుమారు 15వేల మంది వినియోగదారులు సందర్శించారు.


కూరగాయలతో ప్రత్యేక ఆకర్షణ


సంతలో పాల్గొన్న ప్రజలు


వివిధ ఉత్పత్తుల స్టాల్స్



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,582.11	1,579.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	638	01
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	1,966	317
సామర్థ్యం (టీఎంసీలు)	5.58	4.21

ప్రశాంతంగా డీసీఈటీ పరీక్ష



ఎస్‌జీ కాలేజీ దగ్గర భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు

బళ్లారి సిటీ, జూన్ 22: డీసీఈటీ(డిప్లోమా సీఈటీ) 2024 ప్రవేశ పరీక్షలు నగరంలోని రెండు పరీక్షా కేంద్రాలలో శనివారం మధ్యాహ్నం 2గంటల నుండి ప్రశాంతంగా జరిగాయి. ఈనేపథ్యంలో పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లు తెరవకుండా, అనధికార వ్యక్తులు రాకుండా నిషేధాజ్ఞలు విధిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష సెంటర్ల వద్ద భద్రత చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

పేటే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



పుష్పాలంకరణలో పేటే ఆంజనేయస్వామి

సిరుగుప్ప, జూన్ 22 : ప్రసిద్ధి చెందిన పేట ఆంజనేయస్వామికి ఘనంగా పుష్పాలంకార సేవలు జరిగాయి. సిరుగుప్ప పట్టణంలో దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన పురాతన ఆలయం పేటే ఆంజనేయస్వామికి ప్రతిశనివారం భక్తులు దర్శనం కోసం బారులు తీరారు. పౌర్ణమి రెండు రోజులు రావడంతో శనివారం కూడా భక్తులు దర్శనం కోసం రద్దీ పెరిగింది. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి పుష్పాలంకార సేవ, ఆకుల పూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు.

నూతన మేయర్‌కు సన్మానం



మేయర్ నందీష్‌బాబును సన్మానిస్తున్న ప్రముఖులు

బళ్లారిరూరల్, జూన్ 22 : బళ్లారి నగరం మోకా రోడ్డులో నూతన మేయర్ ముల్లంగి నందీష్ బాబును కాంగ్రెస్ ప్రముఖులు హగరి వెంకటేష్, మాజీ ఉపమేయర్ రాముడుతో పాటు పలువురు శనివారం ఆయన నివాసంలో కలసి, శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎక్సైజ్ సీఐ ధనరాజ్‌కు ఘన సత్కారం



బళ్లారి సిటీ,జూన్ 22: బళ్లారి అఖిల కర్ణాటక కమ్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ధనరాజ్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గారపాటి రామకృష్ణమాట్లాడుతూ ఉద్యోగంలో మరింత ఉన్నతంగా ఎదగాలని కోరారు.కార్యక్రమంలో కమ్మసోదరులు కుడితిని శ్రీనావాస్, శేషగిరిరావు, నారాయణస్వామి, సూరి,వద్దట్టి సూరి, పార్థసారథి, హరి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సుందర బళ్లారే లక్ష్యం

- నగరపాలికెలో త్వరలోనే తగినంత సిబ్బంది
- స్వచ్ఛమైన నీరు సరఫరా చేస్తాం
- బళ్లారి మేయర్ నందీష్ బాబు వెల్లడి



బళ్లారి, జూన్ 22(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరపాలికెలో జనాభాకు తగ్గట్టుగా విధులు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని బళ్లారి నగరపాలికె మేయర్ ముల్లంగి నందీష్ బాబు అన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డీకే శివకుమార్, ఎంపీ నాసీర్ హుసేన్, ఎంపీ తుకారాంలతో చర్చించి సిబ్బంది భర్తీకి ఉత్తర్వులు తెస్తామని పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. బళ్లారి నగర పాలికెలో వివిధ పనులపై వచ్చే ప్రజలకు సులభతరంగా పనులుచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల, భవనాల నిర్మాణానికి నిబంధనల ప్రకారం తక్షణమే అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. ఫారం ఏ, తదితర అనుమతులు కోసం అర్జీపెట్టుకున్న వారికి తక్షణం అనుమతులు ఇచ్చేలా చూస్తామని పేర్కొన్నారు.

నగరంలో పురాతన పైపులైన్లు ఉన్న కొన్ని చోట్ల పగిలిపోయి తాగునీటి పైపుల్లో డ్రైనేజీ నీరు కలుస్తోందన్న విషయం మా దృష్టికి వచ్చిందన్నారు. పాత పైపులు ఉన్న చోట కొత్త పైపులు వేసి తాగునీరు కలుషితం కాకుండా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతామన్నారు. నగరంలో రోడ్లు శుభ్రం చేసే కార్మికులు, అండర్ డ్రైనేజీ పనులు చేసే కార్మికులకు కొరత ఉందని, ఈ విషయాన్ని ప్రభుత్వం, నగర పాలికె అభివృద్ధి మండలి దృష్టికి తీసుకు వెళ్లి కొత్తగా సిబ్బంది నియామకం చేపడతామన్నారు. అలాగే దుకాణాలదారులు రోడ్లపై చెత్త పారవేయకుండా ప్రతి దుకాణం దారుడు ఒక చిన్న డస్టు బిన్ అంగడి ముందు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దాన్ని నగర పాలికే వాహనాల్లో వేయాలని కోరారు. చెత్తను రోడ్లపై వేయడం వల్ల అపరిశుభ్రత పెరిగి వ్యాధులు సోకి అనర్థాలకు దారి తీస్తుందని చెప్పారు. ప్లాస్టిక్ పేపర్ల వాడకం తగ్గాలంటే ఇంటి నుండి ప్రతిఒక్కరు ఒక క్లాత్ బ్యాగ్‌ను క్యారీ చేస్తే ప్లాస్టిక్ బ్యాగుల వాడకం తగ్గిపోతుందన్నారు. దీన్ని ప్రజలు అలవర్చుకోవాలని సూచించారు. నగరంలో ప్రజలు మంచి వాతావరణంలో జీవించడానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మేయర్ నందీష్ బాబు చెప్పారు.

గ్రామాల్లో జోరుగా ఏరువాక సంబరాలు



కుడితిని పట్టణంలో ఎద్దుల పరుగు పందాలు తిలకించేందుకు తరలివచ్చిన స్థానికులు

కంప్లి, జూన్ 22 : గ్రామాల్లో ఏరువాక పౌర్ణమి సంబరాలు వైభవంగా నిర్వహించుకుంటున్నారు. ఎద్దులకు రంగులుపూసి, పరుగు పందాలకు వదులుతున్నారు. గ్రామాల్లో జ్యేష్ఠ పౌర్ణమిని మొదటి పండుగగా భావించి ప్రతి ఇంట తమ ఆరాధ్యదైవానికి పూజలు చేసి స్వామి వారికి మొక్కులు సమర్పించుకుంటున్నారు. కుడితిని పట్టణంలో శుక్ర, శని వారాల్లో ఏరువాక పౌర్ణమి సంబరాలు వైభవంగా జరిగాయి. పట్టణాన్ని తోరణాలతో అలరించారు. జోడు ఎద్దులకు పరుగు పందాలు నిర్వహించారు. ఈ పరుగు పందాల్లో అక్కిజడెప్పకు చెందిన ఎద్దులు మొదటి స్థానంలో రావడంతో ఆయనకు నగదు అవార్డును అందించారు. గ్రామాల్లో ప్రతి పండుగను భక్తిశ్రద్ధలతో ఐక్యతగా పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు నాగన్న, రైతులు, గోపాలప్ప, పంపాపతి, నాగరాజు, రమేష్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వానరాలకు కదళీ విందు!

- హనుమాన్ ! అని ఆయన పిలిస్తే.. వానరాలు పరుగున వస్తాయి
- మూగజీవులపై కంప్లి పట్టణానికి చెందిన మాధవరెడ్డి ప్రేమ



కంప్లి, జూన్ 22 : ఎవరైనా మూగజీవులను ఆప్యాయంగా, ప్రేమగా పలకరిస్తే అవి కూడా అంతే ఆప్యాయతను అందిస్తాయి. ఎంతో ప్రేమగా పలుకుతాయి. అందులోనూ మానవుల్లో ఎక్కువమంది స్నేహితులకు ప్రాధాన్యమిస్తారు. మరికొందరు మూగజీవులను స్నేహితులుగా చేసుకుని వాటిని ప్రేమతో పెంచగలుగుతారు. అటువంటివారు పిలిస్తే మూగజీవులు పరుగునరావడం మనం చూస్తూనే ఉంటాం. కంప్లి పట్టణానికి చెందిన మాధవరెడ్డి ఇదే కోవలోకి వస్తాండు. రైతు జీవనం సాగించే అతడు తమ పొలం నుంచి మార్కెట్‌కు తరలించగా మిగిలిన పండిన అరటికాయలను వానరాలకు తీసుకువచ్చి పెడతాడు. కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో సుమారు వంద నుంచి 200 ఎర్రముచ్చు కోతులకు ఉదయం స్వామి హోటల్ వద్ద ట్రేలలో అరటిపండ్లు అందిస్తాడు. అలాగే ప్రతి శనివారం అంజనాద్రి కిష్కింధలోని పంపాసరోవరం వద్ద ఆయన హనుమాన్ అని పిలిస్తే చాలు. కొండల్లో నుంచి, చెట్లపై నుంచి పరుగులు తీస్తూ వానరాలు అతని వద్దకు ఆప్యాయతతో వస్తాయి. అతడు ఇచ్చిన అరటి పండ్లు సేవించి కాసేపు ఆయనతో మాట్లాడుతూ కాలం గడుపుతాయి. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క జీవి, పక్షులైనా, జంతువులైనా మనం ప్రేమగా పలకరిస్తే వాటి నుండి కూడా మనకు అటువంటి ప్రేమ తిరిగి లభిస్తుందంటారు.

పంపా సరోవరం వద్ద వానరాలకు అరటి పండ్లు తినిపిస్తున్న మాధవరెడ్డి

పక్షి శాంక్చురీలో కనిపించని కార్యాలయం

బళ్లారి సిటీ,జూన్ 22:హగరి బొమ్మనహళ్ళి తాలూకాలో 750హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతంలో పక్షి అభయారణ్యం ఉన్నప్పటికీ తాలూకాలో అటవీ శాఖ కార్యాలయం మాత్రం ఏర్పాటుకాలేదు. యునెస్కో ఆదేశాల మేరకు భారత ప్రభుత్వం రామ్‌సర్ సైట్‌గా ప్రకటించిన అంకసముద్ర బర్డ్ శాంక్చురీ, కళ్యాణ కర్ణాటక తొలి పక్షి అభయారణ్యం ఇదే తాలూకాలో ఉన్నాయి. బట్టర్ కల్లు అటవీ ప్రాంతం సుమారు 3300హెక్టార్లలో, దశంపుర ఆటవీ ప్రాంతం 3200 హెక్టార్లలో ఉంది. బట్టర్‌కల్లు ప్రాంతం విశాలమైనది. అంకసముద్ర పక్షుల అభయారణ్యం జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపుపొందింది. 244ఎకరాల విస్తీర్ణంలో 250కంటే ఎక్కువ జాతుల వలస పక్షులు ఇక్కడ ఉన్నాయి. చలికాలంలో విదేశాల నుండి కొన్ని పక్షులు సంతానోత్పత్తి కోసం వస్తాయి. ఇక్కడి జీవవైవిధ్యం రాష్ట్రంలో మరెక్కడా లేదని పక్షి శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇక్కడ అటవీ ప్రాంతంలో తోడేళ్లు, నక్కలు అధికంగా ఉన్నాయి. వందల సంఖ్యలో నెమళ్లు ఉన్నాయి. తుంగభద్ర బ్యాక్ వాటర్స్ కింగ్ హంస, అనేక జాతుల అరుదైన జాతుల పక్షులకు నిలయం. ఇన్ని ప్రత్యేకతలున్న తాలూకాలో అటవీ శాఖ కార్యాలయం లేకపోవడంతో అనేక పనులు నత్తనడకన సాగుతున్నాయి. సామాన్యులు తమ సొంత భూముల్లోని చెట్ల నుంచి వ్యవసాయ పనులకు కలపను వాడుకోవాలంటే హొస్పేట్ అటవీ శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. హగరి బొమ్మనహళ్ళి తాలూకాలో అవసరమైన కార్యాలయాన్ని ఏర్పాటు చేసి జోనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌ను , కేటాయిస్తే కార్యాలయంలో పూర్తి స్థాయిలో సిబ్బంది ఉంటారు. అయితే పక్షులు ,చెట్ల సంరక్షణ కోసం తక్షణమే కార్యాలయం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పక్షి ప్రేమికుడు విజయ్‌కుమార్ ఇట్టిగి చెబుతున్నారు.

వైభవంగా కరిమారెమ్మ ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టిన దృశ్యం

కంప్లి, జూన్ 22: వేణివీరాపురం గ్రామం వద్ద ఎస్‌హెచ్ 63 రోడ్డుపక్కన వుండే కరిమారెమ్మ ఆలయ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఉదయం జలాభిషేకం, అమృతాభిషేకంతో పాటు కుంకుమార్చన, హోమాలు జరిపారు. ప్రతి యేటా కరిమారెమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఎంతో సంబరంగా జరుపుకుంటామని ఆలయ కమిటీ పదాధికారులు తెలిపారు. ఉభయ జిల్లాల్లోని కరిమారెమ్మ భక్తాదులు పూజల్లో పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయంకు వచ్చిన భక్తాదులకు అన్నదానం చేపట్టారు.

బస్టాండులో విద్యుత్ సరఫరాకు అంతరాయం



లైట్లు వెలగని కుడితిని బస్టాండు

కంప్లి, జూన్ 22 : జిల్లా పరిధిలోని కుడితిని బస్టాండులో గత కొన్ని రోజులుగా విద్యుత్ సమస్య ఏర్పడింది. ఈ సమస్య వల్ల బస్టాండులో విద్యుత్ లైట్లు వెలుగక రాత్రివేళల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే శౌచాలయాల్లో నీరు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై కేఎస్ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా కుడితిని హిత రక్షణ సమితి అధ్యక్షులు కామేష్ మాట్లాడుతూ జిల్లాలో అతి ఎక్కువగా రెవెన్యూ వుండే ఈ బస్టాండులోనే సమస్యల వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ అందించే తీగలు తెగిపోయి పడ్డాయని, ఇప్పటికైనా అధికారులు ముందుకొచ్చి మరమ్మతులు జరిపి బస్టాండులో విద్యుత్ లైట్లు వెలిగేలా చూడాలని కోరారు.

గణేకల్ జలాశయానికి కృష్ణ నీరు



గణేకల్ జలాశయం జాక్‌వెల్‌ను పరిశీలిస్తున్న మంత్రి డా.శరణప్రకాశ్

రాయచూరు, జూన్ 22 : జిల్లాలోని ఎస్.గణేకల్ గ్రామ జలాశయానికి కృష్ణ నది నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా.శరణప్రకాశ్ పాటిల్ తెలిపారు. శనివారం దేవదుర్గ తాలూకాలోని కృష్ణనదిపై అప్రాళ వద్ద ఏర్పాటు చేసిన జాక్‌వెల్‌ను మంత్రి పరిశీలించారు. ఇప్పటికే తుంగభద్ర ఎడమ కాలువ ద్వారానీటిని విడుదల చేసి రాయచూరు నగరానికి తాగునీరందించే జలాశయాలన్నింటిని భర్తీ చేశామన్నారు. త్వరలోనే గణేకల్ చెరువును కూడా నీటితో నింపుతామన్నారు. తొలి ప్రాధాన్యతగా తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకొనేలా అధికారులను ఆదేశించినట్లు మంత్రి వివరించారు.

మైనింగ్ అనుమతులకు తొందరెందుకు?

- కుమారస్వామికి సామాజిక కార్యకర్త ఎస్ఆర్ హిరేమఠ ప్రశ్నాస్త్రం



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఆర్ హిరేమఠ

రాయచూరు, జూన్ 22: కేంద్ర ఉక్కు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే రాష్ట్రంలో మైనింగ్ అనుమతులు ఇవ్వడాన్ని సామాజిక కార్యకర్త ఎస్ఆర్ హిరేమఠ తప్పుబట్టారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామి చూపిన తొందరపాటు అభ్యంతరకరమన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కేంద్ర మంత్రి ఇచ్చిన అనుమతులకు సంబంధించి ఇప్పటికే తాము న్యాయమూర్తి సామాజిక కార్యకర్తలు, పర్యావరణ పరిరక్షకులతో చర్చించేందుకు తగిన వేదిక ఏర్పాటు చేశామన్నారు. కేఐఓసీఎల్ సంస్థ చేపట్టిన మైనింగ్ వల్ల పర్యావరణానికి జరుగుతున్న ముప్పుకు సంబంధించి ఇప్పటికే న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా పూర్తి విషయాన్ని పరిశీలించకుండానే మంత్రి అంత తొందరపడి నిర్ణయం తీసుకోవల్సిన అవసరం ఏం వచ్చిందన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి తీరును తప్పుబట్టిన ఎస్ఆర్ హిరేమఠ, త్వరలోనే ఈ విషయం పై తాము రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ వేత్తలు, న్యాయమూర్తులతో కలిసి ఆందోళనకు దిగుతామన్నారు.

హోసూరు జోన్

కల్తీ మద్యం విక్రయాలు జరగకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కేఎం సరయు

హోసూరు(కృష్ణగిరి) జూన్ 22: కృష్ణగిరి జిల్లాలో కల్తీ మద్యం, డ్రగ్స్ విక్రయాలు జరగకుండా రెవిన్యూ శాఖ, పోలీసులు సీరియస్‌గా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు కోరారు. గ్రామ పరిపాలన అధికారులు తమ గ్రామంలో కల్తీ మద్యం తయారీ, అక్రమంగా మద్యం విక్రయాలు. డ్రగ్స్ విక్రయాలు జరిగినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కృష్ణగిరి జిల్లాలో మాదకద్రవ్యాల నివారణపై పోలీసు, రెవిన్యూ శాఖ, విద్యాశాఖ, కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. కృష్ణగిరి జిల్లాలో కల్తీ మద్యం తయారీపై సమాచారం అందించని అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నకిలీ మద్యం, డ్రగ్స్ గురిచి ప్రజలు10581 నంబర్‌కు ఫోన్ చేయాలని, 24 గంటల టోల్ ఫ్రీ నెంబర్ 6374000754 కు వాట్సాప్‌లో ఫిర్యాదులు తెలియజేయవచ్చునన్నారు. అలాగే కృష్ణగిరి జిల్లాలో మిథనాల్‌ను ఉపయోగించే కర్మాగారాల ప్రతినిధులతో కూడా ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మిథనాల్ నిల్వ అనుమతించిన స్థాయిని మించరాదని తెలిపారు. అలా మంజూరు చేయబడిన స్టాక్ మొత్తాన్ని మించి నిబంధనలకు విరుద్ధంగా ఒకవేళ వాడితే సంబంధిత కంపెనీల మిథనాల్ లైసెన్స్ రద్దు చేసి, క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. మిథనాల్ ఉన్నచోట్ల సీసీటీవి కెమెరాలను తప్పనిసరిగా అమర్చాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పి.తంగదురై, అసిస్టెంట్ కమీషనర్ కుమరన్ సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

- ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, జూన్ 22: ఏపీలోని అనంతపురం జిల్లా మండలంలోని కొత్తపేట గ్రామశివారు 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విష్ణు(4) అనే బాలుడు మృతి చెందాడు. శనివారం తమిళనాడు రాష్ట్రం దర్మపురి జిల్లా పెన్నాగరం గ్రామానికి చెందిన కార్తీక్, భార్య సత్య, కుమారుడు విష్ణు, బావమరిది మెహన్‌తో కలసి ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్తున్నారు. కొత్తపేట గ్రామశివారులోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విష్ణు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కార్తీక్ హైదారాబాద్‌లో హట్ చిప్స్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.




మృతి చెందిన విష్ణు..రోదిస్తున్న తల్లిదండ్రులు

ప్రత్యంగిరా దేవి ఆలయంలో పౌర్ణమి పూజలు

హోసూరు జూన్ 22 : హోసూరు వేపనపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రాహుకేతు సమేత శ్రీ మహాప్రత్యంగిరాదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని మూలవిరాట్‌ను వివిధ పూలతో అలంకరించారు. యాగశాలలో భక్తాదులు హోమంలో ఎండుమిర్చి వేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి నెల పౌర్ణమి పూజలకు ఎక్కువ సంఖ్యల్లో భక్తులు వచ్చి ప్రత్యంగిర అమ్మవారిని దర్శించుకుంటున్నారు.

పంట నష్టంపై సమగ్ర వివరాలు అందజేయాలి

- ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి శరణప్రకాశ్ పాటిల్

రాయచూరు, జూన్ 22: గత ఏడాది ఆయకట్టు రైతులకు జరిగిన పంటనష్టం వివరాలను సమగ్రంగా అందజేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. పంటనష్టం పరిహారానికి సంబంధించి అనేక మంది రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి అందజేయాలన్నారు. శుక్రవారం నగరానికొచ్చిన మంత్రి వర్షభావ పరిస్థితి తాగునీటి సమస్య తదితర అంశాలకు సంబంధించి వివిధ శాఖల అధికారులతో నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, డాక్టర్ శివరాజ్ పాటీల్, దద్దల బసనగౌడ, హంపయ్య నాయక్, ఎమ్మెల్సీ ఎ.వసంత్‌కుమార్ తదితరులు ఆయకట్టు రైతుల వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయకపోవడం వల్లే రైతులకు పరిహారం అందలేదన్నారు. నీరు సక్రమంగా అందకపోవడంతో పంటనష్టానికి గురైన రైతులకు నీరు రాకపోగా నష్టపరిహారం కూడా అందకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు ఇస్తున్న సమాచారం సమగ్రంగా లేదని సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కాగా జడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండ్వే మాట్లాడుతూ 10వ విడత జిల్లాకు రూ.141 కోట్లు పరిహారం సొమ్ము విడుదల కాగా 14,517 మంది రైతులకు పరిహారం పంపిణీ చేశామన్నారు. తుంగభద్ర కాల్వల ద్వారా సింధనూరు, మాన్వి, సిరవార తాలూకాలకు నీటి విడుదల జరిగిందని, నారాయణపుర కుడి కాల్వకు నీటిని విడుదల చేయాల్సి ఉందని వివరించారు. ఇటీవల పిడుగుపాటుకు గురైన సింధనూరు తాలూకా అమరాపూర గ్రామ యువకుని కుటుంబానికి పరిహారం అందజేసినట్లు జడ్పీ సీఈఓ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం




మృతి చెందిన తాయప్ప(ఫైల్)

రాయచూరు, జూన్ 22: మాన్వి పట్టణ ప్రభుత్వ అతిథి గృహానికి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న 20 ఏళ్ల యువకుడు తాయప్ప అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. బైక్ పై వెనక కూర్చున్న కృష్ణ నాయక్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వేగంగా వెళుతున్న లారీని అంతకంటే వేగంగా వెళ్లి ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగింది. లారీని ఓవర్ టేక్ చేస్తున్న సందర్భంగా బైక్ లారీ వెనకి చక్రాల కింద పడిపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న మాన్వి పట్టణ పోలీసులు సంఘటన స్థళాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. కాగా తీవ్రంగా గాయపడిన కృష్ణ నాయక్(18)ను రిమ్స్ ఆస్పత్రికి చికిత్స కోసం పంపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కొసరాజు (జయంతి)



తెలుగు సినిమా పాటల రచయితగా పేరొందిన కొసరాజు రాఘవయ్య చౌదరి 1905 జూన్ 23న బాపట్ల తాలూకా కర్లపాలెం మండలం చింతాయపాలెంలో జన్మించారు. జాగర్లమూడి కుప్పుస్వామి చౌదరి సలహాతో మద్రాస్ చేరుకుని కమ్మవారి చరిత్ర పరిశోధన చేపట్టారు. యక్షగానాలు, వీధిభాగవతాలు, హరికథలు, జముకుల కథలు, బుర్రకథలు, భజన గీతాలు, గంగిరెద్దుల గీతాలు ఇలా ఎన్నో రాశారు. తెలుగు సినిమాలో కొసరాజుది ప్రత్యేకం. ఏరువాక సాగాలో రన్నో... అంటూ సేద్యగాళ్లకు ఉత్సాహం రేకెత్తేలా ధైర్యం చెప్పినా, రామయతండ్రి ఓ రామయ తండ్రి మా నోములన్ని పండినాయి రామయ తండ్రీ వంటి పాటలు నేటికీ ఆదరణ పొందాయి. పనిగట్టుకుని హాస్యాన్ని పాటల్లోకి ప్రవేశపెట్టిన ఘనత కొసరాజుదే. హాస్యాన్ని సాంఘిక విమర్శకు కూడా వాడుకున్నారు.

మార్కస్ జుసక్ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియన్ రైటర్ మార్కస్ జుసక్ 1975 జూన్ 23న జన్మించారు. ది బుక్ థీఫ్, ది మెసెంజర్ వంటి రెండు నవలలు అంతర్జాతీయంగా అమ్ముడై గుర్తింపు పొందారు. ఎన్ఎస్ డబ్ల్యు ప్రీమియర్స్ లిటరరీ అవార్డు, ప్రింట్జ్ అవార్డు తదితర అవార్డులు పొందారు. 2023లో టీవీ సిరీస్ కూడా వచ్చాయి.

సాహితీవేత్త కమలాహంపన కన్నుమూత

▸▸ ముఖ్యమంత్రి సహా ప్రముఖుల సంతాపం



కడపటి నివాళులు అర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



కమలాహంపన (ఫైల్)

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కన్నడ సాహితీవేత్త కమలాహంపన (89) శనివారం గుండెపోటుతో కన్నుమూశారు. సాహితీ పరిశోధకులు హంపా నాగరాజయ్య భార్య కమలాహంపన. వయోసహజ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న కమలాహంపన డాలర్స్ కాలనీలోని కుమార్తె ఆరతి నివాసంలో ఉన్నారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు ఆమెకు గుండెపోటు రాగా వెంటనే ఎంఎస్ రామయ్య ఆసుపత్రికి కుటుంబసభ్యులు తరలించారు. చికిత్సలు ఫలించక ఆమె శనివారం తుదిశ్వాస వీడారు. రాజాజినగర్‌లోని హంపానాగరాజయ్య నివాసానికి పార్థివదేహాన్ని తరలించారు. ఉదయం 10 గంటలదాకా అక్కడే ఉంచారు. ఆ తర్వాత ప్రజల సందర్శనకోసం రవీంద్రకళాక్షేత్ర ప్రాంగణంలోని సంసరంగమందిర వేదికకు తరలించారు. మధ్యాహ్నం దాకా పార్థివదేహాన్ని అక్కడే ఉంచారు. ఆ తర్వాత కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కడచూపు చూశారు. అనంతరం పార్థివదేహాన్ని ఎంఎస్ రామయ్య ఆసుపత్రికి అప్పగించారు. కమలాహంపనకు భర్త నాగరాజయ్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కమలాహంపన అధ్యయనం, అధ్యాపనం, రచనలు, ప్రసంగాలు, పరిశోధనల రంగంలో 60ఏళ్లపాటు సాహిత్యానికి ఎనలేని కృషి చేశారు. మూడబిదరెలో జరిగిన 71వ అఖిలభారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు. ప్రభుత్వం నుంచి దాన చింతామణి, అత్తిమబ్బె పురస్కారాన్ని, హంపి కన్నడ విశ్వవిద్యాలయం నుంచి నాడోజా పురస్కారం అందుకున్నారు. ఆమె సమగ్ర సాహిత్యానికి అనుబంధంగా 9 సంపుటాలు విడుదలయ్యాయి. పరిశోధన ఆమె తొలి ప్రాధాన్యతగా ఉండేది. ప్రచురించబడిన 60కుపైగా కృతులలో సృజనాత్మకమైనవి ఉన్నాయి. నాటకాలు, కథలు, వచనాలు సృష్టించేశక్తి అనిపించాయి. బిందళి, భుగడి, బయలు లాంటి ఆధునిక వచనాలు ఉన్నాయి. కమలాహంపన మృతిపట్ల సీఎం సిద్దరామయ్య తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రవీంద్రకళాక్షేత్రలో ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. డీసీఎం డీకే శివకుమార్, కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి ప్రగాఢసంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షులు బరగూరు రామచంద్రప్ప, మనుబళిగార్, నాగరాజమూర్తి, డిఎస్ మోహన్‌తోపాటు ప్రముఖ సాహితీవేత్తలు నివాళులు అర్పించారు. ఆమె మృతి సాహితీ లోకానికి తీరని లోటు అని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



లేఖనా సామగ్రి వితరణ

బంగారపేట, జూన్ 22: పట్టణంలోని కారహళ్ళి ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పాఠశాల పూర్వవిద్యార్థులు నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రిని పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి, యువ ప్రముఖుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ మా ఊరి పాఠశాల అంటే మాకు ఎంతో గర్వకారణమన్నారు. ఇక్కడ చదువుకున్నవారు ఎంతోమంది ఉన్నత హోదాలు అలంకరించారని వారిలో నేను కూడా ఒకరినన్నారు. మా పాఠశాలకు ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందాలన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ప్రభుత్వ పాఠశాలయే ఆధారమన్నారు. తాను చదివిన పాఠశాల విద్యార్థులకు తనవంతు ఏదైనా సాయం చేయాలనే ఉద్దేశ్యంతో పుస్తకాలు, లేఖనా సామగ్రి అందచేశామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆలోచనలు, కార్యవైఖరి అభినందనీయమన్నారు. ఇలాగే విద్యార్థులు చక్కగా రాణించాలని అభిలషించారు. ఈ సందర్భంగా మునిరెడ్డి, కృష్ణప్ప, సుబ్రమణి, రాజప్ప, మంజునాథ, లోకేశ్, రాజేశ్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, కవిత, సహనా, అంబిక తదితరులు పాల్గొన్నారు.

కైవారలో ఘనంగా పున్నమి పూజలు



తాతయ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతామణి రూరల్, జూన్ 22: తాలూకాలోని శ్రీక్షేత్రం కైవారలోని సద్గురు యోగి కైవార నారేయణమఠంలో జ్యేష్ఠమాసం పున్నమిని పురస్కరించుకుని శనివారం విశేషపూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో శ్రీదేవి, భూదేవి సమేత అమరనారేయణస్వామి, సద్గురు తాతయ్య ఉత్సవమూర్తికి అభిషేకం, అష్టావధాన సేవ నిర్వహించారు. మహామంగళారతి అనంతరం రథోత్సవం నిర్వహించారు. భక్తులు పూజా కైంకర్యాలలో పాల్గొన్నారు. అధ్యాపకుడు యరమరెడ్డిహళ్ళి వెంకటరమణప్ప ప్రవచనం చేశారు. నాదసుధారస వేదికపై అఖండ సంకీర్తన నిర్వహించారు. ఆలంబగిరి దేవాలయం నుంచి సుమారు కిలోమీటరు దూరం మేర ఆలంబగిరి ప్రదక్షిణ ప్రకృతి రమణీయ నడుమ నిర్వహించారు. ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరామ్ సహ భక్తులు పెద్దసంఖ్యలో గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు.

మానవ వనరుల ప్రగతితోనే కంపెనీలకు గుర్తింపు



సదస్సులో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రముఖులు

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): మానవ వనరుల ప్రగతితోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయి కంపెనీలకు గుర్తింపు సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో బెంగళూరు చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ), వెలింగ్కర్ ఎడ్యుకేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ సదస్సు జరిగింది. ఐటీఈఎస్, ఎఫ్ఎంసీజీ, బీఎఫ్ఎస్ఐ వంటి వందకుపైగా హెచ్‌ఆర్ ప్రముఖులు భాగస్వాములయ్యారు. ప్రతి కంపెనీలోనూ ఉద్యోగులకు పనిచేసే వాతావరణం, వైవిధ్యత ఉండాలన్నారు. ఇన్‌క్లూజా ఎనేబుల్ ఇండియా సొల్యూషన్స్ సీఈఓ వినయ్ చిన్నప్ప, హెచ్‌ఆర్ ప్రొఫెషనల్స్ ముఖ్యులు దాస్ సూర్యవంశీ, సీఎస్ఎస్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ డైరెక్టర్ సాయి కవిత, పీపుల్ ఐక్యూ ఫౌండర్ సోనాలిగుప్త, ప్రొఫెసర్ కృష్ణదర్ప తదితరులు పాల్గొన్నారు. ప్రెసిడెన్సీలో రెండో ఏడాది హెచ్‌ఆర్ కాంక్లేవ్ జరుగుతోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఐటీ బీటీలతోపాటు ఎంఎన్‌సీ కంపెనీలు అభివృద్ధి చెందేందుకు హెచ్‌ఆర్ ప్రగతి ఆశాజనకంగా ఉండడం కారణమన్నారు.

ఫ్రీడంపార్కులో మల్టీపార్కింగ్ సదుపాయం

▸▸ గాంధీనగర్, మెజస్టిక్‌లో పార్కింగ్ నిషేధం



మల్టీపార్కింగ్‌ను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఫ్రీడంపార్కులో నిర్మించిన మల్టిపార్కింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో గాంధీనగర్, మెజస్టిక్ ప్రాంతాల్లో పార్కింగ్ నిషేధం అమలులోకి వచ్చింది. గాంధీనగర్, మెజస్టిక్ ప్రాంతాల్లో ఇక పార్కింగ్ ఉండదు. 2015లో 80 కోట్ల రూపాయలతో పార్కింగ్ బిల్డింగ్ నిర్మాణానికి ప్రాజెక్టు రూపొందించారు. గత ప్రభుత్వంలో సీఎం సిద్దరామయ్య శంకుస్థాపన చేయగా శుక్రవారం డీసీఎం డీకే శివకుమార్ లాంఛనంగా ప్రారంభించారు. దేశంలోనే ఇది తొలి టెక్నాలజీ పార్కింగ్‌గా ఉంది. ఉచితంగ పికప్ అండ్ డ్రాప్ సౌలభ్యం ఉంటుంది. విధానసౌధ, హైకోర్టు, సివిల్‌కోర్ట్, ఎంఎస్ బిల్డింగ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ వైఫై, కార్‌స్పా, మరుగుదొడ్లు, ఈవీ చార్జింగ్, కాఫీ స్టాల్, అంబులెన్స్ సదుపాయాలు ఉంటాయి. ద్విచక్రవాహనాలకు గంటకు 15 రూపాయలు, కారుకు 25 రూపాయలు ధర నిర్ణయించారు. మెజస్టిక్‌తోపాటు ఈ ప్రాంతంలో పనిచేసే వేలాదిమంది ఉద్యోగులకు మల్టి పార్కింగ్ అందుబాటులోకి వచ్చింది.

టర్ఫ్‌క్లబ్‌లో గుర్రపు పందేలపై హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం అభ్యంతరం

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): టర్ఫ్‌క్లబ్‌లో హార్స్‌రేసింగ్‌కు అనుమతించిన ఏకసభ్య ధర్మాసనం తీర్పును ద్విసభ్య ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. బెంగళూరు టర్ఫ్‌క్లబ్ రేస్‌కోర్సులో పందేలు జరిపేందుకు ఏకసభ్య ధర్మాసనం అనుమతులు ఇచ్చింది. ఇందుకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌ను విచారణ జరిపిన న్యాయమూర్తులు ఎన్వి అంజారియా, కెవి అరవింద్‌ల ద్విసభ్య ధర్మాసనం అభ్యంతరాలు తెల్పుతూ శనివారం ఆదేశాలు ఇచ్చింది. రేస్‌కోర్స్‌లో నిబంధనలకు అనుగుణంగా పందేలు జరిపేందుకు అనుమతులను ప్రశ్నిస్తూ దాఖలైన పిటీషన్‌పై విచారణ జరిగాయి. ప్రభుత్వం పందేలు నిర్వహించకుండా ఉండేందుకు పలు కారణాలు చూపింది. ఈమేరకు పందేలకు అనుమతిస్తూ కేటాయించిన మధ్యంతర ఆదేశాలను పెండింగ్‌లో పెట్టినట్టు తీర్పునిచ్చింది. బెంగళూరు టర్ఫ్‌క్లబ్‌లో ఆన్‌కోర్స్, ఆఫ్ కోర్స్‌లకు నిర్బంధం విధించారు. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేశారు. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ శశికిరణ్ వాదనలు వినిపించారు. హార్స్‌రేస్ వేళ బుకీలు భారీగా అవినీతికి పాల్పడతారని, సీసీబీ జరిపిన దాడిలో వెలుగులోకి వచ్చిందన్నారు. టర్ఫ్‌క్లబ్, ట్రైనర్స్ అసోసియేషన్, హార్స్ ఓనర్ల సంఘం, జాకీల సంఘం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. రేస్‌కోర్స్‌లో బెట్టింగ్ చట్టబద్ధమని ప్రభుత్వానికి కోట్లాదిరూపాయల ఆదాయం వస్తుందన్నారు. బెట్టింగ్‌తో పేదలకు ఇబ్బంది అంటే ప్రభుత్వం చట్టవ్యతిరేకమని ప్రకటించాలని కోరారు. ఏకసభ్య ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా శనివారం నుంచి పోటీలు జరిపేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే చివరిక్షణంలో తీర్పు రావడంతో వాయిదా పడింది.

ఆర్థిక అభివృద్ధి, ప్రగతి దేశానికి రెండు స్తంభాలు



పట్టాల ప్రదానంలో ప్రముఖులు

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అభివృద్ధి, ప్రగతి దేశానికి రెండు ప్రముఖ ఆధారస్తంభాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ భానుమూర్తి అభిప్రాయపడ్డారు. సౌందర్య గ్రూప్ విద్యాసంస్థలలో 450మంది పట్టభద్రులకు డిగ్రీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భానుమూర్తి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సమకాలీన ప్రపంచంలో భారత్ విశ్వవ్యాప్తంగా ఆర్థికతతో గతంలో ఎన్నడూ లేని విధంగా దూసుకు పోతోందన్నారు. దశాబ్ద కాలంలో అనూహ్యమైన మార్పులు వచ్చాయని, ఉన్నత విద్య అభ్యసించేవారు ఎక్కువయ్యారన్నారు. ఎఫ్‌కెసిసిఐ చైర్మన్ రమేశ్‌చంద్ర లాహోటి, సంస్థ సీఈఓ కీర్తన్‌కుమార్, ప్రిన్సిపాల్ వాసు తదితరులు పాల్గొన్నారు. జ్ఞానాన్ని పెంపొందింపచేయడం అత్యంత ముఖ్యమైనదన్నారు.

రైల్వే అండర్‌పాస్‌లో చిక్కుకున్న భారీ వాహనం



ఇరుక్కున్న భారీ వాహనం ఇలా...

దొమ్మసంద్ర, జూన్ 22: చందాపుర రైల్వే బ్రిడ్జ్ కింద భారీ వాహనం చిక్కుకుంది. గుజరాత్ నుంచి చెన్నైకు వెళ్తున్న లారీలో ట్రాన్స్‌ఫర్ తరలిస్తున్నారు. రైల్వే అండర్‌బ్రిడ్జ్‌కు ఉన్న బ్యారికేడ్‌కు వాహనం చిక్కుకుని ఆగిపోయింది. శనివారం సాయంత్రం సుమారు 6 గంటలకు చిక్కుకున్న వాహనం రాత్రి అయినా మార్పు చేసేందుకు సాధ్యం కాలేదు. ఎలక్ట్రానిక్‌సిటీ నుంచి చందాపుర వరకు 6కిలోమీటర్ల ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. శనివారం సాధారణంగా చందాపురలో వారపు సంత నిర్వహిస్తారు. దీంతో రద్దీ అధికంగా ఉంటుంది. ఎలక్ట్రానిక్‌సిటీ పెట్రోలింగ్ అధికారి భరత్ స్థలాన్ని పరిశీలించి ట్రాఫిక్‌ను మళ్లించే పనిలో నిమగ్నమయ్యారు.

కెంపేగౌడ జయంతిని ఘనంగా నిర్వహించాలి



సన్నాహకసభలో పాల్గొన్న ప్రముఖులు

బంగారపేట, జూన్ 22: నాడప్రభు కెంపేగౌడ జయంతి నిర్వహణపై పట్టణంలోని ఆర్ఎంసీ యార్డ్‌లో శనివారం సన్నాహకసభ జరిగింది. వివిధ ప్రముఖులు పాల్గొన్నారు. తాలూకా యంత్రాంగం, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 27న కెంపేగౌడ జయంతి ఘనంగా నిర్వ హించేలా తీర్మానించారు. తాలూకాలోని అన్ని సామాజికవర్గాల ప్రముఖులతో చర్చించి పలు అంశాలపై తీర్మానించారు. కెంపేగౌడ సర్కిల్‌లో తొలుత మాలార్పణతో కార్యక్రమం ప్రారంభమవుతాయన్నారు. నైస్ ఇంటర్నేషనల్ స్కూల్ రఘు, నారాయణస్వామి, టీచర్ నారాయణస్వామి, ఎస్ గౌడ, జగదీశ్, ముద్దేగౌడ, శ్రీని వాస్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

నష్టాల పాలు

- ఆవు పాల ధరలు తగ్గించేశారు
- డిమాండ్ తగ్గిందంటున్న ప్రైవేట్ డెయిరీలు
- లీటరుకు రూ.5 కోత
- మహరాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి అధికంగా ఉత్పత్తి
- నష్టాలు తప్పవంటున్న పాడి రైతులు

రాప్తాడు, జూన్ 22: నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి.. కరివేపాకు నుంచి కారం పొడి దాకా ధరలు భగ్గుమంటున్నాయి. కానీ పాడి రైతులు కష్టపడి ఉత్పత్తి చేసిన ఆవు పాల ధరలు మాత్రం తగ్గించేశారు. పాలు అధికంగా వస్తున్నాయి.. డిమాండ్ లేదని, డెయిరీ నిర్వాహకులు చెప్పడంతో రైతులకు ఆందోళనే మిగులుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఆవు పాల ధరలు తగ్గించేశారు. ప్రైవేటు డెయిరీలు లీటరు పాలపై రూ. 5 తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో పాడి ఆవులు అధికంగా ఉన్నాయని, పాల ఉత్పత్తి పెరిగిందని, ఇతర రాష్ట్రాల పాలు తక్కువ ధరకే సరఫరా అవుతున్నాయనే కారణంతో పాల ధరలు తగ్గించేశారు. అయితే పాల ధరలు తగ్గిస్తే పశువులనే పోషించుకుని జీవనం సాగించే రైతులు గిట్టుబాటు కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాణా ధరలు, రవాణా చార్జీలు పెరిగినా పాల ధరలు తగ్గించడం అన్యాయమని వాపోతున్నారు. డెయిరీ నిర్వాహకులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గిస్తున్నారని వాపోతున్నారు. ఇలా అయితే నష్టాల పాలు కాక తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు సాధ్యం కాకే.. పాడి వైపు..

పంటల సాగుకు పెట్టుబడులు ఎక్కువ కావడం, పంట చేతికందే సమయంలో అతివృష్టి, అనావృష్టి, గిట్టుబాటు ధర లేకపోవడం తదితర కారణాల వలన రైతులు నష్టాలతో అప్పుల పాలవుతున్నారు. వ్యవసాయం భారమవుతున్న తరుణంలో జిల్లాలో అనేక మంది రైతులు పాడి పశువుల పెంపకంపై దృష్టి సారించారు. పాడి ఆవులు కొనుగోలు చేసి పాల ఉత్పత్తి ద్వారా వచ్చిన డబ్బుతో పిల్లల చదువులు, జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 4.97 లక్షల పాడి ఆవులు ఉన్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారులు తెలిపారు. రోజూ దాదాపు 30 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. పాలను ఎక్కువగా ప్రైవేటు డెయిరీలే సేకరిస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రైవేటు డెయిరీలు ఇప్పటికే పాల ధరలు లీటరుపై రూ. 5 తగ్గించారు. మరికొన్ని ప్రైవేటు డెయిరీలు ఈనెల 20 నుంచి పాల ధరలు తగ్గించారు. పరిమితికి మించి పాలు ఎక్కువగా వస్తున్నాయని అందువలన రేటు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు చెబుతున్నారు. మహరాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పాలు ఇక్కడికి దిగుబడి అవుతున్నాయి. దానికి తోడు స్థానికంగా కూడా పాల ఉత్పత్తి అధికంగా పెరిగింది. దీంతో ధరలు తగ్గించాల్సి వస్తోందని డెయిరీ యజమానులు ఏజెంట్లకు చెబుతున్నారు. ప్రైవేట్ డెయిరీ యజమానులందరూ సిండికేట్ అయ్యి పథకం ప్రకారం పాల ధరలు తగ్గించారని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

దాణా, ఆవుల ధరలు అధికమే

ఒక పాడి ఆవు కొనుగోలు చేయాలంటే రూ. 50 వేల నుంచి లక్ష వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. పశువులకు మేత, దాణాలైన నూక, బిస్కెట్, వడియాలు, బుస, పొప్పిలిపిండి ఇతర దాణాలు రేట్లు అధికంగా ఉన్నాయి. పాడి పశువును పోషించాలంటే అధికంగా ఖర్చవుతుంది. లీటరు ఆవు పాలకు రూ. 40 ఇస్తేనే రైతులకు గిట్టుబాటు అవుతుంది. గత 15 రోజుల వరకు పాల నాణ్యతను బట్టి లీటరుకు రూ. 35 నుంచి 40 వరకూ రైతులకు చెల్లించారు. ప్రస్తుతం ధరలు తగ్గించడంతో కొన్ని డెయిరీలు ఇప్పటికే తగ్గిన ధరల ప్రకారం రైతులకు చెల్లిస్తున్నారు.

పాలు పంపవద్దంటున్నారు : ఆది, డెయిరీ ఏజెంట్

నేను ప్రతి రోజు దాదాపు 1400 లీటర్లు పాలు రైతుల నుంచి సేకరించి ఓ ప్రైవేటు డెయిరీకి పంపిస్తాను. 10 రోజులకు ఒకసారి రైతులకు పాల బిల్లు చెల్లిస్తా. పాల దిగుబడి పెరిగిందని, ప్రస్తుతం డెయిరీకి పంపుతున్న పాల కంటే ఎక్కువ పాలు పంపద్దని డెయిరీ యజమానులు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి పాలు ఎక్కువగా అధికంగా సరఫరా అవుతున్నాయని, ఆ పాలు ఇక్కడ పాలకు ఇచ్చే ధర కంటే తక్కువ ధరకే ఇక్కడికి పంపుతున్నారన్నారు. రైతుల పాలు వద్దనలేక ఏజెంట్లు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో డెయిరీ ఏజెంట్లు పాలు సేకరణ మానేస్తున్నారు.

లీటరుకు రూ.5 వరకూ తగ్గించారు

- గేటు సత్తి, రైతు గంగలకుంట

మాది వ్యవసాయ కుటుంబం. వ్యవసాయం, పాడి పరిశ్రమపైనే జీవనం సాగిస్తున్నాం. 4 పాడి ఆవులు ఉన్నాయి. ప్రతి రోజూ 30 లీటర్ల పాలు ప్రైవేటు డెయిరీకి పోస్తాం. ప్రతి 15 రోజులకు లేదా 10 రోజులకు ఒకసారి బిల్లు చెల్లిస్తారు. ఇది వరకూ ఆవు పాలు నాణ్యత బట్టి లీటరుకు 35 నుంచి 40 వరకూ చెల్లించేవారు. ప్రస్తుతం పాల ధర లీటరుకు రూ. 5 వరకూ తగ్గించారు. పాడి పశువులకు ఉపయోగించే దాణా ధరలు పెరిగి పోయాయి. పాల ధరలు మాత్రం తగ్గిస్తే ఎలా.?. దీనపై డెయిరీలు ఆలోచించాలి.

రేస్ ఎకోలో గణేశ్ ఇకోస్పియర్ పెట్టుబడులు

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రముఖమైన పీఈటీ బాటిల్ తిరిగి వినియోగించే రేస్ ఎకోచైన్ లిమిటెడ్‌లో గణేశ్ ఇకోస్పియర్ పెట్టుబడులకు సిద్ధమైంది. తద్వారా దేశంలో ప్లాస్టిక్ ప్యాకేజింగ్, వ్యర్థాలను తగ్గించే విధానం ద్వారా సర్క్యులర్ ఎకానమీని ఉత్తేజించేందుకు కంపెనీ కట్టుబడిందన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్‌లో రేస్ ఎకోచైన్ 2030 నాటికి సమగ్రంగా విస్తరించే ఆలోచనలో ఉంది. వ్యర్థాలను ఆధునిక యంత్రాల ద్వారా పర్యావరణాన్ని కాపాడేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. 500కుపైగా డిస్ట్రిబ్యూటర్‌లను కలిగి ఉన్నట్టు కంపెనీ ప్రకటనలో తెలిపింది. 2030 నాటికి ఆదాయాన్ని 40-50శాతాన్ని పెంచుకోదలిచింది. మార్కెట్‌లో 25శాతం షేర్ లక్ష్యంగా ఉంది. బాటిల్ టు బాటిల్ తయారీకి అవసరమైన ముడిసరుకును దేశవ్యాప్తంగా సమకూర్చుకునేందుకు వాషింగ్‌లైన్‌లను స్థాపించదలిచారు. రేస్ ఎకోచైన్ ఎండీ సునిల్‌మాలిక్ మాట్లాడుతూ గణేశ్ ఇకోస్పియర్ సంస్థ పెట్టుబడులకు ముందుకు రావడం సుస్థిర భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతోందన్నారు. గణేశ్ కంపెనీ అపారమైన వనరులను ప్రయోజనాన్ని పొందే ఆలోచనతో ముందుకు వచ్చిందన్నారు.

వినాయక్ ఆర్ గోయెల్‌కు ఏజీఎస్ కీలక పదవి

బెంగళూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ పేమెంట్ సబ్సిడియర్ ఇండియా ట్రాన్సాక్ట్ సర్వీసెస్ ఎండీగా ఏజిఎస్ కంపెనీ ఆర్ గోయెల్‌ను నియమించింది. బ్యాంకులు, కార్పొరేట్ క్లయింట్‌లకు డిజిటల్, నగదు ఆధారిత లావాదేవీలను పరిష్కరిస్తున్న ఏజిఎస్ టెక్నాలజీ కీలకమైన పదవికి వినాయక్ ఆర్ గోయెల్‌ను నియమిస్తున్నట్టు ప్రకటించింది. 2021 జూన్ 9నుంచి 2024 జూన్ 16వరకు ఐటీఎస్ఎల్ నాన్ ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా వినాయక్ సేవలందించారు. నియామకంపై ఏజిఎస్ సంస్థ చైర్మన్ రవి బి గోయెల్ అభిప్రాయం మేరకు డిజిటల్ లావాదేవీలలో ఆవిష్కరణలకు కొత్త యుగం వచ్చిందని అందుకు అనుగుణంగానే వినాయక్ గోయెల్‌ను నియమించామన్నారు.

మేము పోలీసులం.. మమ్మల్నే డబ్బులు అడుగుతావా..?

రాప్తాడు, జూన్ 22: మేము..పోలీసులం మమ్మల్నే బిల్లు కట్టమంటావా అంటూ హల్‌చల్ చేశారు. డాబాలో పని చేసే మహిళపైనే దాడి చేశారు. అయితే వాళ్లు నకిలీ పోలీసులు.. మందేసి నానా యాగీ చేశారు. మద్యం మత్తులో అర్ధరాత్రి డాబా వద్ద నకిలీ పోలీసులు హల్ చల్ చేశారు. డాబాలో తిన్నందుకు బిల్లు కట్టమంటే మేము పోలీసులం..మమ్మల్నే బిల్లు అడుగుతావా అంటూ విర్రవీగారు. బిల్లు అడిగినందుకు మహిళపై దాడి కూడా చేశారు. డాబాలో పనిచేసే సిబ్బంది, డాబా యజమాని అక్కడికి రావడంతో నకిలీ పోలీసులు కారులో వెళ్లిపోయారు. రాప్తాడు సమీపంలో ప్రసన్నాయపల్లి క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ డాబాకు శుక్రవారం అర్ధరాత్రి ఓ వీఆర్ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు ఏపీ39జేఎఫ్ 2766 కారులో వచ్చారు. అప్పటికే వారు మద్యం తాగి ఉన్నారు. డాబాలో ఫుడ్ ఆర్డర్ చేసి కావల్సినంత తిన్నారు. బిల్లు కట్టమంటే మేము పోలీసులమని (వీఆర్ కానిస్టేబుల్‌తో పాటు వచ్చిన ఇద్దరు) బిల్లు కట్టేది లేదని దబాయించారు. మేము ఎస్ఐ, పోలీసులమంటూ డాబా సిబ్బందిని బూతులు తిట్టారు. తినగా మిగిలిన ఆహారాన్ని వారిపై విసిరి నానా యాగీ చేశారు. తిన్నారు కదా బిల్లు కట్టాల్సిందే అని మహిళ నిలదీయడంతో ఆమెపై కూడా దాడి చేసినట్లు వాపోయింది. అక్కడ ఉన్న వారు రాప్తాడు పోలీసులకు ఫోన్ చేయడంతో స్టేషన్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ అక్కడికి వచ్చాడు. డాబాలో పని చేసే సిబ్బంది, యజమాని అక్కడికి వచ్చి మీరు ఏ స్టేషన్ పోలీసులు, ఏ ఊరు మీది ఎక్కడి నుంచి వచ్చారు అని నిలదీయడంతో వారు హుటాహుటిన కారులో ఎక్కారు. అక్కడున్న వారు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఎక్కువ మంది గుమిగూడటంతో వారు కారులో అక్కడి నుంచి వెళ్లిపోయారు. శనివారం ఉదయం రాప్తాడు సీఐ మునిస్వామి డాబా వద్దకు వెళ్లి ఘటనపై ఆరా తీశారు.